వైభవంగా దేవతామూర్తుల విగ్రహాల ఊరేగింపు


విగ్రహాలను ఊరేగిస్తున్న భక్తులు


దేవతామూర్తుల వేషధారణలో చిన్నారులు

అబిడ్స్: సీతారాంబాగ్ ఆలయంలో దేవతామూర్తుల విగ్రహాల ఊరేగింపు వైభవంగా కొనసాగింది. సోమవారం అర్ధరాత్రి వరకు సీతారాంబాగ్ పరిసర ప్రాంతాల్లో అయోధ్య సంబరాల వేడుకలు అంబరాన్నంటాయి. హన్మంతుడు, సీతాదేవి, శ్రీరాముడు, లక్ష్మణుడు విగ్రహాలను జై శ్రీరామ్ అంటూ నినాదాలతో ఊరేగించారు. 50 మంది చిన్నపిల్లలు ఆంజనేయస్వామి వేషధారణలో అలరించారు. సుందరకాండ పారాయణం పెద్ద ఎత్తున నిర్వహించారు. అర్ధరాత్రి వరకు వేలాది మంది భక్తులు సీతారాముల ఆలయంలో పూజలు చేశారు. దేవాలయ రక్షణ సమితి తెలంగాణ అధ్యక్షులు కామ్లేకర్ సందీప్‌కుమార్ ఆధ్వర్యంలో ముఖ్య అతిథులకు ఘనంగా సత్కారం చేశారు. ఈ కార్యక్రమంలో పంకజ్‌కుమార్, డిజ్‌మోహన్ సింగ్, కైలాష్ లాల్, క్రాంతికుమార్, జస్మత్‌పటేల్, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

జోరుగా దీపాలంకరణ..

ఆలయంలో వేలాది దీపాలతో దీపాలంకరణ చేశారు. నిర్వాహకులతో పాటు భక్తులు కూడా దీపాలు వెలిగించి జై శ్రీరామ్ నినాదాలు చేశారు. గంగోత్రి రామానుజదాస్ మహారాజ్ పాల్గొని పూజలు చేశారు.

మైనర్లు వాహనాలు నడపొద్దు

నగర ట్రాఫిక్ టీటీఐ ఏసీపీ శంకర్‌రాజు


అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న ట్రాఫిక్ ఏసీపీలు శంకర్‌రాజు, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు

చార్మినార్: మైనర్లు వాహనాలను నడపొద్దని..అది చట్టరీత్యా నేరమని నగర ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఏసీపీ జి.శంకర్‌రాజు అన్నారు. మైనర్లు వాహనాలు నడుపుతూ తనిఖీల్లో పట్టుబడితే అతనితో పాటు వాహనం యజమానిపై కూడా క్రిమినల్ కేసులు నమోదవుతాయన్నారు. జాతీయ రహదారి భద్రతా వారోత్స వాల్లో భాగంగా నగర ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్, బేగంపేట్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రభుత్వ సిటీ కాలేజీలో విద్యార్థులకు రోడ్డు భద్రతా, ట్రాఫిక్ నియమ నిబంధనలపై అవగాహన కల్పించారు. నెహ్రూ యువ కేంద్ర సంఘటన్, ప్రభుత్వ సిటీ కాలేజీ సహకారంతో ఎన్‌సీసీ, ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులతో కలిసి సిటీ కాలేజీ నుంచి సాలార్‌జంగ్ మ్యూజియం వరకు ర్యాలీ నిర్వహించి దారి పొడవునా ట్రాఫిక్‌పై అవగాహన కల్పించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. డ్రైవింగ్ లైసెన్స్ లేకపోవడం, త్రిబుల్ రైడింగ్, ఓవర్ స్పీడ్, రాంగ్ రూట్ డ్రైవింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్, డ్రంకన్ డ్రైవ్ చేస్తూ తమతో పాటు ఇతర వాహనదారుల ప్రాణాలను ఫణంగా పెట్టొదన్నారు. ఈ కార్యక్రమంలో దక్షిణ మండలం ట్రాఫిక్ ఏసీపీ చంద్రశేఖర్‌రెడ్డి, నెహ్రూ యువ కేంద్ర సంఘటన్ రాష్ట్ర డైరెక్టర్ ఏఆర్ విజయారావు, అసిస్టెంట్ డైరెక్టర్ గంటా రాజేశ్, జిల్లా యువ జన అధికారి ఖుస్బు గుప్తా, సిటీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ బాల భాస్కర్, ఎన్‌ఎస్‌ఎస్ ఇన్‌చార్జి నాగరాజు, బేగంపేట్ టీటీఐ ఇన్‌స్పెక్టర్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

అఫ్జల్‌గంజ్: 11 కే.వి ఆగాపురా విద్యుత్ ఫీడర్ పరిధిలోని నమాజ్ గ్రౌండ్, ఆగాపురా నాలా, మహమద్‌బాగ్, దర్గసర్దార్ బేగ్, గంగాపుత్ర కాలనీ, శంషేర్‌బాగ్ తదితర ప్రాంతాల్లో బుధవారం ఉదయం 9 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ అధికారులు ఓ ప్రకటన ద్వారా తెలిపారు. అలాగే 11 కే.వి జించిచౌరా, ఆసిఫ్‌నగర్ విద్యుత్ ఫీడర్ పరిధిలోని ప్రకాష్ టాకీస్, బోయిగూడ, రాణా ప్రతాప్ కాన్ఫరెన్స్ హాల్, రాకెట్ గ్రౌండ్స్, దారుస్సలాం, ఫ్రెండ్స్ కేఫ్, అఫ్జల్‌సాగర్, విజయలక్ష్మి అపార్ట్‌మెంట్స్, పాలిశెట్టి మల్లియ్య, పాత ఫీల్‌ఖానా, మల్లెపల్లి తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

11 నుంచి బొడ్రాయి, రేణుకా ఎల్లమ్మ విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవాలు


భూమి పూజలు చేస్తున్న ఎన్‌బీఎస్ అధ్యక్షుడు మదిర సత్యనారాయణ

జియాగూడ: ఇమాంపురాలో ఫిబ్రవరి 11వ తేదీ నుంచి నాలుగు రోజుల పాటు బొడ్రాయి, రేణుకా ఎల్లమ్మ విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవాలు నిర్వహించనున్నట్లు ఇమాంపురా నవభారత్ సంఘం అధ్యక్షుడు మదిర సత్యనారాయణ పేర్కొన్నారు. మంగళవారం ఎన్‌బీఎస్ కమిటీ హాల్ వద్ద భూమిపూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..11న పురానాపూల్ నుంచి బొడ్రాయి, రేణుకా ఎల్లమ్మ విగ్రహాల ఊరేగింపు ఇమాంపురా బస్తీకి చేరుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు వినయ్‌కుమార్, జశ్వంత్‌కుమార్, మహేష్ బాబు, సంతోష్ కుమార్, లక్ష్మీనారాయణ, బాలకిషన్, యాదయ్య, సి.బాబు, పురుషోత్తమ్, మహేందర్, నర్సింహ, నర్సింగ్‌రావు పాల్గొన్నారు.

సంఘం బలోపేతానికి కృషి చేస్తాం


కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న గడ్డం జ్ఞానేశ్వర్, కొండూరు గంగాధర్

నాంపల్లి: తెలంగాణ నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం ఖమ్మం జిల్లా నూతన సంవత్సరం–2024 కేలండర్ ఆవిష్కరణ సభ మంగళవారం నాంపల్లిలోని గృహకల్ప భవన సముదాయంలోని కేంద్ర సంఘం కార్యాలయంలో జరిగింది. ఖమ్మం జిల్లా అధ్యక్షుడు బిక్కు నాయక్ అధ్యక్షతన జరిగిన ఈ ఆవిష్కరణ సభకు ముఖ్య అతిథులుగా తెలంగాణ నాల్గవ తరగతి ఉద్యోగుల కేంద్ర సంఘం రాష్ట్ర అధ్యక్షులు గడ్డం జ్ఞానేశ్వర్, ప్రధాన కార్యదర్శి కొండూరు గంగాధర్ హాజరై ఆవిష్కరించి ప్రసంగించారు. త్వరలోనే జిల్లాల పర్యటనలు చేపడతామని పేర్కొన్నారు. అన్ని జిల్లాల్లో పర్యటించి సంఘాన్ని మరింత బలోపేతం చేస్తామని తెలిపారు. రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఖాదర్ బిన్ హసన్, నేతలు ధన్‌రాజ్, దాస్యా నాయక్, జి.శ్రీనివాస్, అంజమ్మ, కోడి లింగన్న తదితరులు పాల్గొన్నారు.

నేడు గోల్కొండ కోటకు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

గోల్కొండ: నేడు గోల్కొండ కోటకు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి రానున్నారు. గోల్కొండ కోటలో సాయంత్రం 5 గంటలకు జరగనున్న లేజర్ షో ప్రారంభ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభిస్తారని బీజేపీ రాష్ట్ర నాయకులు దేవర శ్రీనివాస్ తెలిపారు.

షబ్బీర్ అలీకి శుభాకాంక్షలు



చాంద్రాయణగుట్ట: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ శాఖల సలహాదారులుగా నియమితులైన షబ్బీర్ అలీకి టీపీసీసీ కార్యనిర్వాహక కార్యదర్శి పర్వతాల రాజేందర్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన నివాసంలో మంగళవారం కలిసి పూలబొకే అందజేసి శాలువాతో సన్మానించారు.

సన్మానం


షబ్బీర్ అలీని సన్మానిస్తున్న అలీ మస్కతి

చార్మినార్: రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులుగా నియమితులైన షబ్బీర్ అలీని మస్కతి డైరీ ప్రొడక్ట్స్ మేనేజింగ్ డైరెక్టర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు అలీ మస్కతితో పాటు ఆదిల్ మస్కతి సోదరులు మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ శాఖల ప్రభుత్వ సలహాదారులుగా ఆయన నియమితులైనందుకు శుభాకాంక్షలు తెలియజేసినట్లు అలీ మస్కతి తెలిపారు. కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నాయకులైన మాజీ మంత్రి షబ్బీర్ అలీకి ప్రభుత్వంలో కీలక బాధ్యతలను అప్పగించడం పట్ల సీఎం రేవంత్‌రెడ్డికి అలీ మస్కతి ధన్యవాదాలు తెలిపారు.

కష్టపడ్డ వారికి పదవులు కేటాయించండి


భట్టి విక్రమార్కను కలిసిన సత్తి ప్రకాష్‌రెడ్డి, గోల్కొండ సతీష్ తదితరులు

అబిడ్స్: కష్టపడి ఎన్నో సంవత్సరాలుగా పార్టీకి సేవలందిస్తున్న వారికి పదవులు అప్పగించి తగిన న్యాయం చేయాలని తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ లీగల్, హ్యూమన్‌రైట్స్, ఆర్టీఐ వైస్ చైర్మన్, ప్రముఖ న్యాయవాది సత్తి ప్రకాష్‌రెడ్డి పేర్కొన్నారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను తెలంగాణ రెవెన్యూ జేఏసీ గోల్కొండ సతీష్‌తో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సత్తి ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ.. అన్నివర్గాల వారికి పదవుల పంపకంలో సముచిత న్యాయం కల్పించాలన్నారు. గోల్కొండ సతీష్ మాట్లాడుతూ.. ఉద్యోగులకు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే న్యాయం జరుగుతుందన్నారు. కేసీఆర్ ప్రభుత్వం పదేళ్లుగా ఉద్యోగులను నట్టేట ముంచిందన్నారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు కె.గౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు.

కష్టపడే వారికి గుర్తింపు


మహేష్‌కుమార్ గౌడ్‌ను అభినందిస్తున్న కిషన్ గజరే

జియాగూడ: కాంగ్రెస్ పార్టీలో కష్టపడి పనిచేసే వారికి తప్పకుండా గుర్తింపు లభిస్తుందని ఆ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. మంగళవారం కాంగ్రెస్ పార్టీ జియాగూడ డివిజన్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు కిషన్ గజరే ఆయనను కలిసి ఘనంగా సన్మానించి అభినందించారు. అనంతరం కిషన్ గజరే మాట్లాడుతూ..కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీ పథకాలు అమలు చేసి తీరుతుందన్నారు.

కవిత్వానికి సామాజిక చైతన్యం ఎంతో ముఖ్యం


కందుకూరి శ్రీరాములును సన్మానిస్తున్న శివారెడ్డి, డాక్టర్ చెన్నయ్య తదితరులు

సుల్తాన్‌బజార్: కవిత్వానికి సామాజిక చైతన్యం ఎంతో ముఖ్యమని ప్రముఖ కవి కందుకూరి శ్రీరాములు అన్నారు. తెలంగాణ సారస్వత పరిషత్ నిర్వహిస్తున్న ప్రఖ్యాత కవులు, విమర్శకులు, పరిశోధకుల ప్రసంగ పరంపర 'నేను నా రచనలు' కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ఆచార్య ఎల్లూరి శివారెడ్డి అధ్యక్షతన మంగళవారం బొగ్గులకుంటలోని తెలంగాణ సారస్వత పరిషత్‌లో నిర్వహించిన సభలో కందుకూరి శ్రీరాములు మాట్లాడుతూ..కవిత్వంలో ముందడుగు వేసే విధంగా డాక్టర్ నందిని సిద్ధారెడ్డి ప్రోత్సహించారని గుర్తుచేశారు. డాక్టర్ సి.నారాయణరెడ్డి తమ పాటలతో పరవశింపజేసి సాహిత్యంపై అభిమానాన్ని పెంచారన్నారు. మొక్క నీరు పోసినట్లు తనలోని కవిత్వాన్ని కె.శివారెడ్డి వికశింపజేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో పరిషత్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె.చెన్నయ్య, డాక్టర్ సిల్మానాయక్ తదితరులు పాల్గొన్నారు.

గోల్కొండ ఆసుపత్రిలో సదరం క్యాంప్



గోల్కొండ: గోల్కొండ ఏరియా ఆసుపత్రిలో ప్రతి మంగళవారం సదరం క్యాంప్ నిర్వహిస్తున్నామని గోల్కొండ ఏరియా ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మజహర్‌ఉల్లా అన్నారు. మంగళవారం గోల్కొండ ఏరియా ఆసుపత్రిలో సదరం క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఈ క్యాంప్‌కు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ క్యాంపులో అంగవైకల్యాన్ని నిర్ధారించే పరీక్షలు జరుగుతాయని అర్హులైన వారికి ధ్రువపత్రాలు అందిస్తామన్నారు. ఈ శిబిరానికి వచ్చే వారు ఆన్‌లైన్‌లో తమ పేర్లను నమోదు చేసుకోని టోకెన్ తీసుకోని రావాల్సి ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఈ క్యాంప్‌లో ఆర్థోపెడిక్ డాక్టర్ క్రాంతి, ఫిజిషియన్ డాక్టర్ చంద్రశేఖర్ అంగవైకల్య నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఈ క్యాంపులో మొత్తం 29 మందికి అంగవైకల్య నిర్ధారణ సర్టిఫికెట్లు ఇవ్వడం జరిగిందని ఆయన తెలిపారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి


ఎస్.ఎం.ముజీబ్ హుస్సేని

అబిడ్స్: ఉద్యోగుల దీర్ఘకాల సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తానని టీఎన్జీఓస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్.ఎం.ముజీబ్ హుస్సేని పేర్కొన్నారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. ఈనెల 24న పబ్లిక్‌గార్డెన్‌లోని లలిత కళాతోరణంలో హైదరాబాద్ జిల్లా టీఎన్జీఓస్ కార్యవర్గ సభ్యుల సమక్షంలో 2024 డైరీ, కేలండర్ ఆవిష్కరిస్తున్నట్లు వెల్లడించారు. ఈ ఆవిష్కరణ సభకు రాష్ట్ర స్పీకర్ గడ్డం ప్రసాదరావు, మంత్రులు పొన్నం ప్రభాకర్‌రావు, ఉత్తంకుమార్‌రెడ్డి, సీతక్క, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు మహ్మద్ షబ్బీర్‌అలీ, ప్రొఫెసర్ కోదండరాం, అద్దంకి దయాకర్‌లతో పాటు పలువురు ప్రముఖులు పాల్గొననున్నారు అని ముజీబ్ వెల్లడించారు.

రాహుల్‌గాంధీపై దాడికి నిరసనగా క్యాండిల్ ర్యాలీ


క్యాండిల్ ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

గౌలిపురా: రాహుల్ గాంధీ చేస్తున్న భారత్ జోడో న్యాయ్ యాత్రకు ప్రజల నుంచి వస్తున్న అనూహ్య స్పందనను ఓర్వలేక బెంబేలెత్తిపోయిన బీజేపీ గుండాలు అస్సాంలో దాడికి పాల్పడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని చార్మినార్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ మాజీ ఇన్‌చార్జి కె.వెంకటేశ్ అన్నారు. రాహుల్‌గాంధీపై జరిగిన దాడికి నిరసనగా టీపీసీసీ పిలుపు మేరకు సోమవారం రాత్రి లాల్‌దర్వాజా మోడ్ నెహ్రూ విగ్రహం వద్ద వెంకటేశ్ ఆధ్వర్యంలో క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్ మాట్లాడుతూ..రాహుల్‌గాంధీపై జరిగిన దాడిని ప్రజాస్వామ్యంపైన జరిగిన దాడిగా ఖండిస్తున్నామన్నారు. కె.సురేశ్ బాబు, మహ్మద్ మూసా ఖాసం, జి.శ్రీనివాస్, టి.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

29, 30 తేదీల్లో మెగా హెల్త్ క్యాంప్

గోల్కొండ: ఈ నెల 29, 30వ తేదీల్లో ఉచిత మెగా హెల్త్ క్యాంప్ నిర్వహిస్తున్నామని సహాయత ట్రస్ట్ ప్రతినిధి హాఫీజ్ ఇర్ఫాన్ నజీబ్ తెలిపారు. ఇండో యూఎస్ ఆస్పత్రి వారి సహకారంతో 13వ ఇండియా హెల్త్ ఇనిషియేటీవ్‌లో భాగంగా గోల్కొండ నయాఖిలాలోని ఉర్దూ హైస్కూల్‌లో ఈ క్యాంప్ నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు వైద్య శిబిరం ఉంటుందని ఆయన తెలిపారు.





పుస్తకావిష్కరణ



గన్‌ఫౌండ్రీ: రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో కిన్నెర ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో ప్రముఖ పద్య కవి ఆచార్య అనుమాండ్ల భూమయ్య రచించిన అప్పాజోస్యుల పద్యావలోకనం పుస్తకావిష్కరణ సభ మంగళవారం రవీంద్రభారతిలో నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం మాట్లాడుతూ..ప్రస్తుత సాహిత్య పద్య సమాజంలో పరిశోధనలు జరగాల్సిన అవసరం ఎంతగానో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పద్మశ్రీ ఆచార్య కొలకలూరి ఇనాంక్, సాహితీవేత్త కసిరెడ్డి వెంకట్‌రెడ్డి, విశ్రాంత ప్రిన్సిపాల్ ఎం.శ్రీమన్నారాయణమూర్తి, పద్య కవి అప్పాజోస్యుల సత్యనారాయణ, కిన్నెర సంస్థ కార్యదర్శి ఎం.రఘురామ్ పాల్గొన్నారు.

కరసేవకులకు సన్మానం



చార్మినార్: 1992లో అయోధ్య కరసేవకు వెళ్లి అప్పటి ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం చేత జైలుకెళ్లి వచ్చిన సీనియర్ బీజేపీ నాయకుడు గాదే పాగ బాలకృష్ణతో పాటు మరికొంత మందిని హిందూ సనాతన ధర్మ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. వారి సేవలను కొనియాడుతూ మెమొంటో అందజేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్, బీజేపీ సీనియర్ నాయకుడు సుభాష్ చందర్ జీ పాల్గొన్నారు.

అభినందనలు



చార్మినార్: చెన్నైలో జరుగుతున్న ఖేలో ఇండియా యూత్ గేమ్స్–2023లో పాతబస్తీ బేలా కాలనీకి చెందిన ఆశీర్వాద్ సక్సేనా 3 మెడల్స్ సాధించినట్లు శాలిబండ సైక్లింగ్ క్లబ్ కార్యదర్శి కె.దత్తాత్రేయ తెలిపారు. సైక్లింగ్ విభాగంలో జరిగిన మూడు పోటీలలో గోల్డ్, సిల్వర్, బ్రాంజ్ మెడల్స్ సాధించి మంగళవారం పాతబస్తీకి వచ్చిన ఆశీర్వాద్ సక్సేనాకు ఘనంగా స్వాగతం పలికి సన్మానించినట్లు ఆయన తెలిపారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యాభ్యాసం చేస్తున్న ఆశీర్వాద్ సక్సేనా శాలిబండ సైక్లింగ్ క్లబ్‌లో శిక్షణ పొందుతున్నారన్నారు.

మైనార్టీలపై దాడులను ఖండించాలి



గోల్కొండ: మైనార్టీలపై దాడుల వెనుక ఉన్న వారిని వెంటనే అరెస్టు చేయాలని ఎమ్మెల్యే కౌసర్‌మొహియుద్దీన్ అన్నారు. సంగారెడ్డి జిల్లా దౌల్తాబాగ్‌లో మైనార్టీ వర్గానికి చెందిన చిరువ్యాపారులపై దాడులు జరిగిన సందర్భంగా ఆయన మంగళవారం ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాము ఈ విషయమై త్వరలోనే సంగారెడ్డి జిల్లా ఎస్పీని కలిసి ఈ ఘటనపై సమగ్ర విచారణ చేపట్టాలని కోరుతామన్నారు. ఇటీవలే కార్వాన్, నాంపల్లి నియోజకవర్గాల్లో ట్రాఫిక్ పోలీసులు ఫుట్‌పాత్, తోపుడు బండ్ల వ్యాపారులకు చలాన్‌లు వేస్తూ వేధించిన ఘటనలను తాము తీవ్రంగా వ్యతిరేకించామని ఆయన గుర్తు చేశారు. ఆయన వెంట నాంపల్లినగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, యామీన్‌ఖాన్ తదితరులున్నారు.

శుభాకాంక్షలు



అబిడ్స్: రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులుగా నియమితులైన మహ్మద్ అలీ షబ్బీర్‌ని తెలంగాణ రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ సెంట్రల్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రదీప్‌కుమార్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రహమత్ అలీ, అసోసియేట్ అధ్యక్షుడు హరిప్రసాద్, కోశాధికారి దేవులపల్లి శ్రీనివాసరావు, వైస్ ప్రెసిడెంట్ ఎం.మధు మంగళవారం వారిని మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రదీప్‌కుమార్ రెడ్డి, రహమత్ అలీలు మాట్లాడుతూ..వాణిజ్య శాఖలో ఉద్యోగుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు.

విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ శిల్పి కళాకారులను ప్రోత్సహించాలి


పురస్కార గ్రహీతలతో గౌరీశంకర్ తదితరులు

గన్‌ఫౌండ్రీ: విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ జాతి శిల్పి కళాకారులను గౌరవిస్తూ ప్రతి యేటా ఆ శిల్పాల పేరిట అవార్డులను అందజేయాలని తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ రిజిస్ట్రార్ డాక్టర్ త్రిమూర్తుల గౌరీశంకర్ కోరారు. మంగళవారం హైదర్‌గూడలో తెలంగాణ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ మాత్య సంఘం ఆధ్వర్యంలో శిల్ప కళాకారులకు పురస్కారాలను ప్రదానం చేశారు. ఆయన మాట్లాడుతూ..విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ శిల్పులను రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహించాలని విజ్ఞప్తి చేశారు. సంఘం అధ్యక్ష కార్యదర్శులు వేములవాడ మదన్‌మోహన్, చొల్లేటి కృష్ణమాచారి మాట్లాడుతూ..ప్రొ. జయశంకర్, కపిలవాయి లింగమూర్తి, కూరెళ్ల విఠలాచార్య, డాక్టర్ రావూరి భరద్వాజ వంటి మహనీయుల పేరిట అవార్డులను అందజేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర సమాచార శాఖ జాయింట్ డైరెక్టర్ కె.వెంకటరమణ, సంఘం గౌరవ అధ్యక్షుడు లాలుకోట వెంకటాచారి, కోశాధికారి రవీంద్రచారి, వివిధ జిల్లాలకు చెందిన అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.

యోగా సభ్యుల సంబరాలు



అబిడ్స్: యోగా సభ్యులు అయోధ్య సంబరాలు కనుల పండువగా నిర్వహించారు. ప్రముఖ యోగా గురువు బొడ్డు మనోహర్ ఆధ్వర్యంలో శ్రీరాముడి జెండాలు ప్రదర్శించి జై శ్రీరామ్ అంటూ నినాదాలు చేశారు. పెద్ద ఎత్తున ప్రసాదాల పంపిణీ, అన్నదానాలు చేశారు.

శ్మశాన వాటికల్లో అన్ని సౌకర్యాలు కల్పిస్తాం

యాకుత్‌పురా: శ్మశాన వాటికల్లో అన్ని సౌకర్యాలు కల్పిస్తామని ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్ అన్నారు. కార్పొరేటర్లతో కలిసి యాకుత్‌పురా, తలాబ్‌కట్టా, మౌలాకాచిల్లా, రెయిన్‌బజార్ తదితర ప్రాంతాల్లోని ముస్లిం శ్మాసన వాటికలను ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. షబే బరాత్ సందర్భంగా శ్మాసన వాటికలో మరమ్మతు పనులు, చెట్ల కొమ్మల తొలగింపు, వీధి దీపాల ఏర్పాటుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ పర్యటనలో రెయిన్‌బజార్, తలాబ్‌చంచలం డివిజన్ల కార్పొరేటర్లు మహ్మద్ వసీవుద్దీన్, సమీనాబేగం, మజ్లిస్ పార్టీ నాయకులు మహ్మద్ జాఫర్, సంతోష్‌నగర్ సర్కిల్ డీఈఈ ఏకాంబరం, పారిశుధ్య విభాగం అధికారులు పాల్గొన్నారు.